
సాక్షి నిజామాబాద్

సోమవారం। 30। డిసెంబర్। 2024



మళ్లీ ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ
పొలాల వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను దొంగలు మళ్లీ ఎత్తుకెళ్తున్నారు. దీంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది.
- 8లో ▸



నూతన ఆశయాలు..
నూతన సంవత్సరంలో ఆశయాల సాధనపై 'సాక్షి' చర్చా వేదికలో మెడికోలు తమ అభిప్రాయాలను పంచుకున్నారు.
- 8లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
35.7 /17.4

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత కొనసాగే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

రైల్వేగేటు మూసివేత పొడిగింపు



నవీపేట: మండల కేంద్రంలోని రైల్వే గేటు వద్ద మరమ్మతులు నేపథ్యంలో మరో రెండు రోజులపాటు గేటును మూసి ఉంచనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజినీర్ శ్రీనివాస్ ఆదివారం తెలిపారు. అత్యవసర మరమ్మతుల నేపథ్యంలో ఈ నెల 26 నుంచి 30వ తేదీ వరకు గేటును మూసివేస్తున్నట్లు ప్రకటించామని పేర్కొన్నారు. అదనపు మరమ్మతులు కొనసాగుతుండడంతో జనవరి 1వ తేదీ వరకు గేటును మూసివేస్తున్నట్లు తెలిపారు. నవీపేట మీదుగా బాసర–నిజామాబాద్ వైపు రాకపోకలు సాగించే ప్రయాణికులు సహకరించాలని కోరారు.

శిశుమందిరాల్లో విలువలతో కూడిన విద్య



ఆర్మూర్ : విద్యార్థులను చదువుకు మాత్రమే పరిమితం చేయకుండా సమాజంలో మనుగడ సాధించేందుకు అవసరమైన జ్ఞానాన్ని, విజ్ఞానాన్ని బోధిస్తూ విలువలతో కూడిన విద్యనందిస్తున్న ఏకైక విద్యాసంస్థలు శ్రీసరస్వతి శిశు మందిరాలని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. పట్టణంలోని టీచర్స్ కాలనీలో ఉన్న శ్రీసరస్వతీ శిశు మందిరం 43వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం నిర్వహించిన పూర్వవిద్యార్థుల మహాసమ్మేళనం కార్యక్రమానికి సూర్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. సరస్వతి శిశు మందిరాలు మొక్కగా ప్రారంభమై నేడు మహా వృక్షంలా ఎదిగి ఎందరో విద్యార్థులను ఉన్నత స్థానాల్లో నిలబెడుతున్నాయని, జాతీయ పునర్నిర్మాణంలో భాగస్వాములను చేయడం నిజంగా గర్వించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో న్యాయవాది లోక భూపతిరెడ్డి, పల్లె గంగారెడ్డి, ఆచార్యులు, ఆర్‌ఎస్‌ఎస్ ప్రముఖులు, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రిన్సిపాళ్లతో కలెక్టర్ సమావేశం

నిజామాబాద్ అర్బన్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్, ఇతర జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లతో కలెక్టరేట్‌లో సోమవారం సమన్వయ సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా ఇంటర్ విద్యాధికారి తిరుమలపుడి రవికుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ బోర్డు కమిషనర్ ఆదేశం మేరకు సాయంత్రం నాలుగు గంటలకు నిర్వహించనున్న సమావేశానికి ప్రిన్సిపాల్‌లు హాజరుకావాలని సూచించారు. ఇంటర్ విద్యార్థుల్లో మానసిక సంసిద్ధతను పెంపొందించడం, విద్యార్థుల్లో యాంటీడ్రగ్స్, ఆత్మహత్యలను నిరోధించే చర్యలు, విద్యార్థుల హాజరు శాతం పెంపునకు తీసుకోవాల్సిన చర్యలు, వార్షిక పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయడంపై సమీక్షలో చర్చించనున్నట్లు వివరించారు.

బతుకమ్మ ఆడి సమగ్రశిక్ష ఉద్యోగుల నిరసన



నిజామాబాద్ అర్బన్: సమగ్ర శిక్ష ఉద్యోగులు సమ్మె ఆదివారం నాటికి 23వ రోజుకు చేరింది. నగరంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో కొనసాగుతున్న దీక్షాశిబిరంలో ఉద్యోగులు బతుకమ్మ ఆడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాజు, భూపేందర్ మాట్లాడుతూ.. విద్యాశాఖలో కీలకంగా పని చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు సరైంది కాదన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి సమగ్ర శిక్ష ఉద్యోగుల న్యాయపరమైన డిమాండ్‌లను పరిష్కరించాలని, తక్షణమే రెగ్యులర్ చేయాలని కోరారు. దీక్షా శిబిరాన్ని టీపీడీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అనిల్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు వెనిగల్ల సురేశ్, జిల్లా ప్రధాన కార్యదర్శి అరవింద్, బహుజన టీచర్స్ అసోసియేషన్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ సంతోష్‌నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి స్వామి నాయక్, మాల మహానాడు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కలిచివేసిన ఆత్మహత్యలు..
పెరిగిన కేసులు

2024 సంవత్సరం ఎన్నో జ్ఞాపకాలను మిగిల్చి కాలగర్భంలో కలిసిపోతోంది. 2023తో పోలిస్తే ఈ ఏడాదిలో వివిధ రకాల కేసుల సంఖ్య పెరగగా, ఆత్మహత్యల ఘటనలు కలిచివేశాయి. సైబర్ నేరగాళ్ల ఉచ్చుకు ఎంతో మంది జిల్లావాసులు చిక్కారు. పోలీసుశాఖ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నా చోరీ కేసులను ఛేదించడంలో పోలీసులు వెనుకంజలో ఉండిపోయారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



చేపూర్ వద్ద నేషనల్ హైవే 44పై గాయాలపాలైన వాహనదారులు (ఫైల్)

- ప్రాణాలను మింగిన రోడ్డుప్రమాదాలు
- క్షణికావేశంలో హత్యలు, హత్యాయత్నాలు
- పెరిగిన సైబర్ నేరాలు, కిడ్నాప్‌లు, పోక్సో, రేప్ కేసులు

రివైండ్ 2024

ఖలీల్‌వాడి: జిల్లాలో ఈ ఏడాది వివిధ కేసుల సంఖ్య పెరిగింది. 2023లో 8,635 కేసులు నమోదుకాగా, 2024లో 8,745 కేసులు నమోదయ్యాయి. గతేడాదితో పోలిస్తే 110 కేసులు(1.27శాతం) పెరిగాయి. ప్రతి ఏడాదిలాగే ఈ ఏడాదీ హత్యలు, ఆత్మహత్యలు, రోడ్డు ప్రమాదాలు, చోరీలు, మోసాలు, సైబర్ నేరాల ఆనవాళ్లను వదిలి కాలగర్భంలోకి వెళ్లిపోతోంది.

రోడ్డు ప్రమాదాలు



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన తండ్రీకొడుకులు రవీందర్, శివరాజ్(ఫైల్)

గతేడాది రోడ్డు ప్రమాద కేసులు 312 నమోదుకాగా, 337 మంది మృతి చెందారు. ఈ ఏడాదిలో 322 కేసుల్లో 335 మంది మృతి చెందారు. హెల్మెట్లు ధరించని కారణంగా ఎక్కువ సంఖ్యలో ద్విచక్రవాహనదారులు మృతి చెందినట్లు పోలీసులు నిర్ధారించారు. మార్చి 8వ తేదీన వేల్పూర్ మండలం అంక్సాపూర్ గ్రామశివారులోని ఆగివున్న లారీని ఢీకొని మోర్తాడ్ మండలంలోని దొన్కల్ గ్రామానికి చెందిన తండ్రీకొడుకులు మాడవేణి రవీందర్(54), శివరాజ్(24) కన్నుమూశారు.

రోడ్డు రవాణా ఆదాయం రూ.14.63 కోట్లు
జిల్లాలో హెవీ, మీడియం, లైట్ మోటార్ వేకిల్స్, మోటార్ సైకిల్, మోపెడ్, ట్రాక్టర్స్ తదితర వాహనాలు 5.17 లక్షలు ఉండగా, వాటి ద్వారా టాక్స్‌ల రూపంలో రూ.14.63 కోట్ల ఆదాయం సమకూరింది. జిల్లాలో ఎలక్ట్రిక్ వాహనాల విక్రయాలు పెరిగాయి.

ఆత్మహత్యలు.. సైబర్ క్రైమ్‌లు



2023లో 356 మంది ఆత్మహత్య చేసుకోగా, ఈ ఏడాది 442 మంది బలవన్మరణాలకు పాల్పడ్డారు. వడ్డీ వ్యాపారుల వేధింపులు, ఆన్‌లైన్ బెట్టింగ్, ట్రేడింగ్ వంటి కారణాలతో పలువురు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. జిల్లాలో గతేడాది 294 సైబర్ క్రైమ్ కేసులు నమోదుకాగా, ఈ ఏడాది 378 కేసులు నమోదయ్యాయి. ఎడపల్లి మండలం వడ్డేపల్లికి చెందిన హరీశ్ అనే యువకుడు ఆన్‌లైన్ బెట్టింగ్‌ల కోసం రూ.60లక్షల అప్పు చేశాడు. దీంతో హరీశ్‌తోపాటు అతడి తల్లిదండ్రులు సురేశ్, హేమలత ఒకేసారి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. వడ్డీ వ్యాపారుల వేధింపులను తాళలేక నగరంలోని న్యాల్‌కల్‌రోడ్డులో నివాసం ఉంటున్న భార్యభర్తలు తమ కూతురితో కలిసి బాసర గోదావరి నదిలో దూకారు. జాలర్లు తల్లిని కాపాడగా, తండ్రీకూతుళ్లు మృతి చెందారు. అలాగే ఆర్థిక ఇబ్బందులతో నగరంలోని ఎల్లమ్మగుట్టకు చెందిన హోంగార్డు రైల్వేస్టేషన్‌లో రైలుకు ఎదురెళ్లి ఆత్మహత్య చేసుకున్నాడు.

తగ్గిన హత్యలు

క్షణికావేశంలో హ్యతలు, ఆత్మహత్యలు చోటు చేసుకున్నాయి. 2023లో 50 మంది హత్యకు గురికాగా, 66 మందిపై హత్యాయత్నాలు జరిగాయి. ఈ ఏడాదిలో 42 మంది హత్యకు గురికాగా, 47 మందిపై హత్యాయత్నం జరిగింది. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది హత్యలు, హత్యాయత్నాలు తగ్గాయి. నగరంలోని ఆరోటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో సెల్‌ఫోన్ వివాదంలో జరిగిన దాడిలో యాకూబ్ అనే వ్యక్తి మృతి చెందాడు. అలాగే నగరంలోని ఒకటో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మిర్చి కంపౌండ్‌లో ఉన్న ఇనుప సామాను దుకాణం వద్ద నాందేడ్‌కు చెందిన వ్యక్తి హత్యకు గురయ్యాడు.





138 మంది ఆచూకీ లేదు

ఈ ఏడాది జిల్లాలో 984 మంది అదృశ్యం కాగా, 846 మంది ఆచూకీని పోలీసులు గుర్తించారు. మరో 138 మంది అచూకీ తెలియాల్సి ఉంది. 18 ఏళ్లలోపు పిల్లల అదృశ్యం కేసులు 140 నమోదు కాగా 130 మందిని గుర్తించారు. 10 మంది ఆచూకీ లభించలేదు.

పెరిగిన చోరీలు.. కిడ్నాప్‌లు.. రేప్‌లు

	2023	2024
చోరీలు	359	421
కిడ్నాప్‌లు	24	57
రేప్‌లు	74	77
పోక్సో	81	115

గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది చోరీలు, కిడ్నాప్ కేసుల సంఖ్య పెరిగింది. జిల్లా కేంద్రంలో ఇటీవల చోరీలు పెరిగాయి. మహారాష్ట్ర గ్యాంగ్ చోరీలకు పాల్పడుతోందని పోలీసులు అనుమానిస్తున్నారు. అంతేకాకుండా మహిళలపై, బాలికలపై అఘాయిత్యాలు పెరిగాయి.

మద్యం విక్రయాలు రూ.1127.42 కోట్లు



జిల్లాలో ఈ ఏడాది రూ.1127.42 కోట్ల విలువైన మద్యం అమ్ముడుపోయింది. బీర్లు 20,36,435 కేస్‌లు, లిక్కర్ 10,69,573 కేస్‌లు విక్రయించారు. నార్కోటిక్ డ్రగ్స్, సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్(ఎన్‌డీపీఎస్) కేసులు 35 నమోదుకాగా 55 మందిని అరెస్ట్ చేశారు. 33.880 కిలోల ఎండుగంజాయిని స్వాధీనం చేసుకున్నారు. 1.20 కిలోల అల్ప్రాజోలం, 530 గ్రాముల పీహెచ్‌ను స్వాధీనం చేసుకుని 66 వాహనాలను సీజ్ చేశారు. 1765 కిలోల బెల్లం, 638 కిలోల పటికను ఎక్సైజ్ పోలీసులు, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

వరకట్న వేధింపులు



జిల్లాలో వరకట్న వేధింపుల కేసులు తగ్గాయి. వరకట్న వేధింపుల కారణంగా ముగ్గురు బలవన్మరణాలకు పాల్పడ్డారు. చిన్నారులపై లైంగిక దాడుల కేసులు పెరిగాయి. 115 పోక్సో కేసులు నమోదయ్యాయి.

వాహనదారులకు రూ.12.30 కోట్ల జరిమానా



ఈ – చలానా రూపంలో జిల్లాలోని వాహనదారులకు పోలీసులు రూ.11.40 కోట్ల జరిమానా విధించారు. నగరంలోనే అత్యధికంగా జరిమానా విధించారు. మొత్తం 3,04,914 కేసులు నమోదు చేశారు. అలాగే 7,698 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు కాగా, రూ.88,90,451 జరిమానా వసూలు చేశారు. 165 మందికి జైలు శిక్ష పడింది.

రెంజల్ పీఎస్‌లో లాకప్ డెత్



రెంజల్ పోలీస్‌స్టేషన్‌లో రత్నావత్ రెడ్యా అనే వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. రెంజల్ మండలం వీరన్నగుట్ట ప్రాంతంలో మతిస్థిమితం లేని బాలికపై ఆత్యాచారం చేశాడనే కారణంతో రెడ్యాపై బాలిక బంధువులు దాడి చేశారు. స్థానికులు డయల్ 100కు ఫోన్ చేయడంతో పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని అతడిని స్టేషన్‌కు తరలించారు. అదే రోజు రాత్రి రెడ్యా ప్యాంట్ నాడాతో స్టేషన్‌లో ఆత్మహత్య చేసుకున్నాడు. దీనిపై మెదక్ జిల్లా తుప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డితోపాటు జ్యుడీషియల్ విచారణ కొనసాగుతోంది. ఈ కేసులో కానిస్టేబుల్ సస్పెండ్ కాగా ముగ్గురికి షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయి. ఫోరెన్సిక్, పోస్టుమార్టం రిపోర్టుల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటారని తెలుస్తోంది. ఇప్పటికే ఈ కేసులో 13 మందిపై కేసులు నమోదు కాగా ఏడుగురిని రిమాండ్‌కు తరలించారు.

15 మందికి జీవిత కారాగార శిక్ష

మర్డర్, రేప్ కేసులతోపాటు వివిధ కేసుల్లో న్యాయస్థానం 15 మందికి జీవిత కారాగార శిక్ష విధించింది. అలాగే ఒకరికి పదేళ్లు, మరొకరికి ఏడేళ్లు, నలుగురికి ఐదేళ్లు, ఏడుగురికి మూడేళ్లు, నలుగురికి రెండేళ్లు, 44 మందికి సంవత్సరకాల శిక్ష పడింది.



నగర అభివృద్ధికి కృషిచేస్తా



రోటరీ నగర్‌వాసుల సమస్యలను వింటున్న నుడా చైర్మన్ కేశ వేణు

నిజామాబాద్ సిటీ : ఇందూరు నగర అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని నుడా చైర్మన్, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు కేశ వేణు అన్నారు. నగరంలోని 7, 8 డివిజన్‌లలో స్థానిక నాయకులతో కలిసి కేశ వేణు ఆదివారం పర్యటించారు. రోటరీనగర్ వాసులు కేశ వేణుకు తమ సమస్యలను ఏకరువు పెట్టారు. నగర అభివృద్ధికి నుడా నుంచి అవసరమైన మేరకు నిధులు విడుదలచేసే అవకాశం ఉంటే పరిశీలిస్తానన్నారు. ఇప్పటివరకు ఉన్న స్థానిక కార్పొరేటర్లు డివిజన్ అభివృద్ధిని పట్టించుకోకపోవడం కారణంగానే ఈ పరిస్థితి ఉందన్నారు. పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, ఎమ్మెల్సీ షబ్బీర్ అలీ దృష్టికి తీసుకెళ్లి అభివృద్ధి పనులకు అదనపు నిధులు మంజూరు అయ్యేలా కృషిచేస్తానన్నారు. అనంతరం కేశ వేణును రోటరీకాలనీ సంఘం నాయకులు శాలువాతో సత్కరించారు. వేణు వెంట రామర్తిగోపి, రమేశ్, బంటు రామ్‌కుమార్, వెంకటేశ్వర్ చారి, నరసింహస్వామి, స్వామిగౌడ్, సతీశ్, హన్మాండ్లు, దత్తు, సుభాచారి, సుదర్శన్, రూప్‌సింగ్ తదితరులున్నారు.

మోడుకు జీవకళ!



పచ్చని పంటపొలాల మధ్య మోడు వారిన చెట్టుకు అక్కడి వాతావరణం జీవకళను పోశాయి. చుట్టూ నీటితో పచ్చని పంటపొలాల మధ్య మోడువారి ఉన్న చెట్టు చూపరులను ఆకట్టుకుంటోంది. ఈ చిత్రం చందూర్ నుంచి పెద్ద గుట్ట వెళ్లేదారిలో 'సాక్షి' కెమెరాకు చిక్కింది.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

నిప్పులాంటి నిజామాబాద్ బిడ్డను

- తప్పు చేయలేదు.. భయపడే ప్రసక్తే లేదు
- కేసీఆర్‌ను ఎదుర్కోలేకే మాపై కేసులు
- రానున్నది బీఆర్‌ఎస్ శకం.. స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుతాం
- నిజామాబాద్ ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత
- ఘనస్వాగతం పలికిన బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు



ప్రసంగిస్తున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత.. వేదికపై ఎంపీ సురేశ్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

నిజామాబాద్‌నాగారం/నిజామాబాద్ రూరల్: నిప్పులాంటి నిజామాబాద్ బిడ్డనని, తాను ఏ తప్పూ చేయలేదని, ఎన్ని కేసులు పెట్టినా భయపడే ప్రసక్తే లేదని ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. తమ పార్టీ అధినేత కేసీఆర్‌ను రాజకీయంగా ఎదుర్కోలేకే తనతోపాటు కేటీఆర్‌పై కాంగ్రెస్, బీజేపీలు కలిసి అక్రమ కేసులు పెడుతున్నాయని ఆరోపించారు. లిక్కర్ కేసులో జైలు నుంచి విడుదలైన తరువాత మొదటిసారి నిజామాబాద్ పర్యటనకు వచ్చిన కవితకు బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఆదివారం ఘనస్వాగతం పలికారు. ఇందల్వాయి టోల్‌ప్లాజా వద్ద బీఆర్‌ఎస్ ఎంపీ కేఆర్ సురేశ్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బాజీరెడ్డి గోవర్ధన్ తోపాటు బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు గజమాలతో ఆమెకు స్వాగతం పలికారు. అక్కడి నుంచి వేలాది మందితో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. నిజామాబాద్ నగరంలోని చంద్రశేఖర్‌కాలనీ చౌరస్తాలో నాయకులు, కార్యకర్తలు బతుకమ్మలు, డప్పువాయిద్యాలతో స్వాగతం పలికారు. అక్కడి నుంచి పాదయాత్రగా బయల్దేరిన కవిత సుభాష్‌నగర్‌లోని తెలంగాణ తల్లి విగ్రహాని కి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అనేక ఇబ్బందులు, కష్టాలు ఎదురైనా పిడికిలి ఎత్తి అన్నింటినీ ఎదిరించి వచ్చానని అన్నారు. పోరాటం చేసి రాష్ట్రాన్ని తీసుకొచ్చిన వాళ్లమని, గట్టిగా నిలబడుతామని, ప్రజల పక్షాన పోరాటం చేస్తామన్నారు. హామీల అమలులో రేవంత్ రెడ్డి సర్కార్ విఫలమైందని, గ్రామగ్రామానా హామీలపై కాంగ్రెస్ నాయకులను నిలదీయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు, మహిళలు, యువత, ఉద్యోగులు, కార్మికులతోపాటు అన్ని వర్గాలను మోసం చేసిందని ధ్వజమెత్తారు. ఊరుకుంటే ప్రభుత్వం కదలదని, ప్రతి ఒక్కరూ ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని అన్నారు. మహిళలక ఉచిత బస్సు అని చెప్పి బస్సుల సంఖ్య తగ్గించారని అన్నారు. బీఆర్‌ఎస్ సత్తాచాటి మరోసారి నిజామాబాద్ పవర్‌ను సీఎం రేవంత్‌రెడ్డికి రుచి చూపిద్దామని పిలుపునిచ్చారు.

అనంతరం రాజ్యసభ సభ్యుడు కేఆర్ సురేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ప్రజాదరణ కోల్పోయిందన్నారు. ఆరు గ్యారెంటీలను అమలు చేయని కాంగ్రెస్‌కు చివరికి మిగిలేది ఆరు సీట్లేనని ఎద్దేవా చేశారు. రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణను దోచుకుని ఢిల్లీలో పెడుతుందన్నారు. ఓటుకు నోటు కేసులో దొరికిన దొంగ రేవంత్‌రెడ్డి అని విమర్శించారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీజేపీలను వెంటాడుతామన్నారు.

అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా మాట్లాడుతూ.. కవిత ఆరోగ్య బాగోలేక బతుకమ్మకు దూరంగా ఉంటే కాంగ్రెస్ ప్రభుత్వం బతుకమ్మను కనబడకుండా చేసిందని విమర్శించారు. జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ విఠల్‌రావు, బోధన్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆయేషా ఫాతిమా, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కేసులతో కాలం వెళ్లదీస్తున్నారు



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను పక్కకు పెట్టి అక్రమ కేసులు పెడుతూ కాలం వెళ్ల దీస్తున్నారు. హామీలు అమలు చేయని ముఖ్యమంత్రి మాట్లాడితే ప్రజలు చూడలేక టీవీలు బంద్ చేసే పరిస్థితి వచ్చింది.

క్లుప్తంగా

గిన్నిస్ రికార్డు సాధించిన వసంతలక్ష్మికి గవర్నర్ సన్మానం



నిజామాబాద్ నాగారం: నగరంలోని సుభాష్నగర్ దయానంద యోగా కేంద్రం సంచాలకుడు యోగ రాంచందర్ వద్ద శిక్షణ పొందిన వసంత లక్ష్మి గిన్నిస్ రికార్డు సాధించారు. ఆమెను గవర్నర్ జిష్ణుదేవ్‌శర్మ సన్మానించారు. వసంత లక్ష్మి 3గంటల 48 నిమిషాల పాటు ఆసనాలు వేసి రికార్డు సాధించారు. ఈ కార్యక్రమంలో రాంచందర్ తదితరులున్నారు.

నేడు ద్విచక్ర వాహనాల వేలం

ఆర్మూర్ టౌన్: ఆర్మూర్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో వివిధ కేసుల్లో పట్టుబడిన ద్విచక్ర వాహనాలకు సోమవారం వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ స్టీవెన్‌సన్ ప్రకటనలో తెలిపారు. మొత్తం నాలుగు వాహనాలను ఉదయం 10గంటలకు వేలం వేస్తామని పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నీ విజేత జిల్లా జట్టు



నిజామాబాద్ నాగారం: సీఎం కప్ వాలీబాల్ టోర్నమెంట్‌లో జిల్లా బాలికల జట్టు సత్తా చాటింది. ఖమ్మంలో ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో మహబూబ్ నగర్‌పై విజయం సాధించింది. బెస్ట్ ఆఫ్ ఫైవ్ పద్ధతిలో జరిగిన తుది పోరులో జిల్లా జట్టు 3–1 తేడాతో గెలుపొంది చాంపియన్‌గా నిలిచింది.

జాతీయస్థాయి పోటీల్లో జిల్లావాసుల ప్రతిభ

జక్రాన్‌పల్లి: జాతీయస్థాయి ఫిస్ట్‌బాల్ పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. తమిళనాడులో జరిగిన పోటీల్లో జూనియర్ విభాగంలో బాలబాలికల జట్లు, సీనియర్ విభాగంలో బాలికల జట్టు విజేతలుగా నిలిచాయి. కాగా తెలంగాణ జట్టులో పడకల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు యాటకర్ల శివకృష్ణ, విష్ణువర్ధన్, కల్యాణి, జగదీశ్వరి, బోండ్ల సలోని, బోండ్ల తేజ పాల్గొని ప్రతిభ కనబరిచారని పీడీ శ్రీనివాస్ తెలిపారు. క్రీడాకారులను రాష్ట్ర ఫిస్ట్‌బాల్ వ్యవస్థాపకుడు జగన్ మోహన్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి వెంకట్, పాఠశాల హెచ్ఎం సురేందర్‌రెడ్డి అభినందించారు.

వరంగల్ బయలుదేరిన జిల్లా ఖోఖో జట్లు



కామారెడ్డి అర్బన్: వరంగల్‌లో ఈ నెల 30, 31, జనవరి 1, 2 తేదీల్లో నిర్వహించే సీఎం కప్ రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొనడానికి జిల్లా బాలుర, బాలికల జట్లు ఆదివారం బయలుదేరి వెళ్లాయి. రాష్ట్ర స్థాయిలో మంచి ప్రతిభ చూపి విజయం సాధించాలని వీడ్కోలు సందర్భంగా పలువురు ఆకాంక్షించారు. ఖోఖో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి అతీక్, కోశాధికారి ఎస్.మధుసూదన్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు నరేష్‌రెడ్డి, సురేష్, పి.సంజీవ్, లింగం, విజయలక్ష్మి, ఆస్మా, యూత్ అండ్ స్పోర్ట్స్ కార్యాలయ ప్రతినిధి రాజేందర్ పాల్గొన్నారు.

నూతన ఆశయాలు సాధించుకుందాం

- కొత్త సంవత్సరంలో నూతనోత్సాహంతో ముందుకు సాగాలి
- 'సాక్షి' చర్చా వేదికలో వైద్య కళాశాల విద్యార్థులు

సాక్షి డిబేట్

నిజామాబాద్ నాగారం: జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ నూతన ఆలోచనలతో కొత్త లక్ష్యాల వైపు పరుగులు తీయాలని.. ఆశయాల సాధనకు అలుపెరగకుండా సాగాలని నిజామాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థులు అన్నారు. గతేడాది చేసిన పొరపాట్లు, దూరలవాట్లకు దూరంగా ఉంటూ... నూతన సంవత్సరంలో నూతనోత్సవంతో జీవితాన్ని ప్రారంభించాలని పేర్కొన్నారు. యాంత్రీకరణ జీవనంతో ఒత్తిడికి లోనుకాకుండా... నిరంతరం సాధన చేసుకుంటూ మెరుగైనా జీవితాన్ని నిర్మించుకోవాలన్నారు. 'సాక్షి' ఆధ్వర్యంలో చేపట్టిన చర్చా వేదికలో వారు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. కార్యక్రమంలో మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ శివప్రసాద్, సాక్షి బ్యూరో ఇన్‌చార్జి తుమాటి భద్రారెడ్డి, కళాశాల సూపరింటెండెంట్ నాగరాజు పాల్గొన్నారు.



నూతన సంవత్సరం సందర్భంగా 'సాక్షి' నిర్వహించిన చర్చా వేదికలో పాల్గొన్న వైద్య విద్యార్థులు



మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ శివప్రసాద్

జీవితాన్ని మీరే నిర్మించుకోండి

2024 సంవత్సరం ఏ విధంగా గడిచిందో మీకు తెలుసు. ఎలాంటి సమస్యలు ఎదురయ్యాయో ఎలాంటి నిర్ణయాలు తీసుకున్నారో తెలుసు. ఎవరి జీవితం వారి చేతుల్లో ఉంటుంది. మంచిగా వెళ్లితే మంచి జరుగుతుంది. కొత్త సంవత్సరంలో అందరూ బాగుండాలి. చెడు వ్యసనాలు ఉంటే వాటి విడిచిపెట్టంటి మీ జీవితాన్ని మీరే అందంగా మార్చుకోవాలి. సోషల్ మీడియాలో నుంచి మంచినే తీసుకోవాలి.

– డాక్టర్ శివప్రసాద్, ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్

విజయాలు సాధించాలి



గత ఏడాదిలో జరిగిన పొరపాట్లను సరిచేసుకోవాలి. కొత్త సంవత్సరంలో నూతనోత్సాహంతో అడుగులు వేయాలి. ప్రతి ఒక్కరు తమకు నచ్చిన రంగాల్లో విజయం సాధించాలి. నేను మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తాను.

– ఆదిత్య, ఎంబీబీఎస్ సెకండియర్

ఒత్తిడి లేకుండా సాగుతా



ఈ ఏడాదిలో ఎక్కువగా ఒత్తిడికి గురయ్యా. చదువు విషయంలో నాతో పాటు చాలామంది ఒత్తిడికి లోనవుతున్నారు. వచ్చే ఏడాది నుంచి అనవసరంగా టెన్షన్‌లు, ఒత్తిడి లేకుండా ప్రశాంతమైన వాతావరణంలో చదువు పూర్తి చేయడానికి ప్రయత్నిస్తా.

– నితీశ్, ఎంబీబీఎస్ సెకండియర్

అవగాహన ఉండాలి



ప్రస్తుతం మనం రాణించాలంటే సమాజంలో జరుగుతున్న విషయాలపై అవగాహన ఉండాల్సిందే. అలాగే చదువును నిర్లక్ష్యం చేయవద్దు. కొత్త సంవత్సరంలోకి కోటి ఆశలతో అడుగు పెట్టబోతున్న యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి.

– ఐశ్వర్య, ఎంబీబీఎస్ సెకండియర్

అందరికీ మంచి జరగాలి



ప్రస్తుత ఏడాదిలో జరిగిన మంచి చెడులపై పరిశీలన చేసుకోవాలి. అలాంటి తప్పులకు తావివ్వకుండా ముందుకు వెళ్లాలి. కొత్త సంవత్సరంలో అందరికీ మంచి జరగాలి.

– అనూష, ఎంబీబీఎస్ సెకండియర్

చదువుపై దృష్టి



2024లో చదువుపై పెద్దగా ఫోకస్ చేయలేదు. ఈ విషయంలో కాస్త బాధగా ఉంది. కొత్త ఏడాదిలో చదువుపై ఎక్కువగా శ్రద్ధ పెడుతా.

– రశీద్ అబ్దుల్లా, ఎంబీబీఎస్ సెకండియర్

మరింత బెస్ట్‌గా ఉంటాను



ప్రతి ఒక్కరు తమ సమస్యలను పరిష్కరించుకోవాలి. ఎలాంటి సవాళ్లు అయినా సరే ఎదుర్కొనే ధైర్యం ఉండాలి. 2025లో మరింత బెస్ట్‌గా ఉండేందుకు ప్రయత్నిస్తా.

– మనోహర్, ఎంబీబీఎస్ సెకండియర్

మరింత కొత్తగా ఉండాలి



యువత అనవసర విషయాల జోలికి వెళ్లొద్దు. 2024తో పోల్చితే కొత్త సంవత్సరం మరింత కొత్తగా ఉండాలి.

– భావిక, ఎంబీబీఎస్ ఫస్టియర్

స్నేహాన్ని బలపర్చుకోవాలి



పాత, కొత్త స్నేహాలు అంటూ పెట్టుకోవద్దు. స్నేహం అంటే నమ్మకం. ఎవరితోనైనా స్నేహం చేస్తే బలంగా ఉండాలి. జల్సాల కోసం స్నేహం చేయవద్దు. కొత్త సంవత్సరంలో స్నేహాన్ని మరింత బలపర్చుకోవాలి.

– శ్రేష్ఠ, ఎంబీబీఎస్ సెకండియర్

కలిసిమెలిసి ఉంటా..



ఈ సంవత్సరంలో చాలా కఠినంగా ఉన్నాను. ఇక నుంచి అలా ఉండవద్దు అనుకుంటున్నాను. అందరితో కలిసి మెలిసి సరదాగా ఉంటూనే లక్ష్యాల వైపు అడుగులు వేస్తాను.

– గీతిక, ఎంబీబీఎస్ సెకండియర్

ఒత్తిడిని అధిగమించాలి



ప్రస్తుతం ప్రతి ఒక్కరు చిన్న విషయాలకు ఒత్తిడికి లోనవుతున్నారు. ఒత్తిడికి దూరంగా ఉండాలంటే వ్యాయామం చేయాలి. ప్రతి మనిషి జీవితంలో మంచి, చెడు ఉంటాయి. చెడుకు దూరంగా ఉండాలి. గత కాలపు జ్ఞాపకాలను పదిలపర్చుకొని కొత్త సంవత్సరంలో ఇంకా మెరుగ్గా రాణించేలా శ్రమించాలి.

– డాక్టర్ స్వాతి, అసోసియేట్ ప్రొఫెసర్

కొత్త ఆలోచనలతో..



నూతన వసంతంలో కొత్త ఆలోచనలతో జీవితాన్ని ప్రారంభించాలని నిర్ణయించుకున్నా. పోయిన ఏడాది జరిగిన పొరపాట్లు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకుంటా.

– ఉజ్వల, ఎంబీబీఎస్ సెకండియర్

క్రీడల్లో పాల్గొనాలి



వయస్సుతో సంబంధం లేకుండా అందరూ క్రీడల్లో పాల్గొనాలి. యాంత్రీక జీవనంలో చాలా మంది క్రీడలకు దూరంగా ఉంటున్నారు. నేను కూడా 2024లో క్రీడలను నిర్లక్ష్యం చేశాను. కొత్త సంవత్సరం నుంచి ఆటలు ఆడుతూనే చదువుకుంటా.

– శరత్, ఎంబీబీఎస్ ఫస్టియర్

ఫోన్‌తో టైమ్ వేస్ట్ చేయొద్దు



2024లో మొబైల్ ఫోన్ ఎక్కువగా ఉపయోగించాను. నాలాగే చాలా మంది మొబైల్స్‌తో టైమ్ వేస్ట్ చేస్తున్నారు. నవ వసంతంతో నేను మొబైల్ వాడకం తగ్గించాలని అనుకుంటున్నా.

– స్నేహారెడ్డి, ఎంబీబీఎస్ ఫస్టియర్

మందు, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి



చాలా మంది యువత మద్యం, డ్రగ్స్‌కు బానిసై జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. కొత్త సంవత్సరం నుంచైనా వీటికి దూరంగా ఉండాలి. మంచి ఆలోచనలతో ఉన్నతంగా ఎదిగేలా ముందుకు సాగాలి.

– అబ్దుల్ ముఖీద్, ఎంబీబీఎస్ సెకండియర్

ఆరోగ్యం చూసుకోవాలి



ప్రస్తుతం ఎవరికి ఎప్పుడు ఎలాంటి రోగం వస్తుందో తెలియని పరిస్థితులు ఉన్నాయి. చదువు ఎంత ముఖ్యమో.. ఆరోగ్యం కూడా అంతే ముఖ్యం. విద్యార్థులు చదువుతో పాటు నిత్యం ఆటలు ఆడుతూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి.

– స్ఫూర్తి, ఎంబీబీఎస్ సెకండియర్

లక్ష్యంతో ముందుకెళ్లాలి



నేను ఒక లక్ష్యంతో ముందుకెళ్లాలని నిర్ణయించుకున్నాను. ఎంబీబీఎస్‌లో అత్యుత్తమ ఫలితాలు సాధించాలని లక్ష్యం పెట్టుకున్నాను. ప్రతి ఒక్కరు కూడా లక్ష్యం పెట్టుకోని దానికి అనుగుణంగా ముందుకు వెళ్లాలి.

– అంజన, ఎంబీబీఎస్ ఫస్టియర్

దేశ అభివృద్ధికి పాటుపడాలి



భవిష్యత్‌లో మంచి స్థాయిలో రాణించాలంటే తమను తాము కొత్తగా తీర్చిదిద్దుకుంటూ ముందుకు సాగాలి. ప్రతి ఒక్కరు దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలి. 2025లో దేశం మరింత వృద్ధిలోకి రావాలి.

– చంద్రకాంత్, పీజీ వైద్యవిద్యార్థి



మెడికల్ కాలేజీకి మృతదేహం అప్పగింత



మాట్లాడుతున్న మండవ వెంకటేశ్వరరావు



రోదిస్తున్న కుటుంబ సభ్యులు

ఖలీల్‌వాడి: ప్రముఖ న్యాయవాది, మానవహక్కుల వేదిక రాష్ట్ర సభ్యుడు గొర్రెపాటి మాధవరావు పార్థివదేహాన్ని ఆయన కుటుంబ సభ్యులు నిజామాబాద్ మెడికల్ కాలేజీకి అప్పగించారు. ఆదివారం ఉదయం మాధవరావు నివాసం నుంచి మృతదేహాన్ని కోటగల్లీలోని ఎన్ఆర్ భవన్‌కు తరలించారు. అక్కడ వివిధ సంఘాల నాయకులు నివాళులు అర్పించారు. మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

నేడు సంతాప సభ

జిల్లా కోర్టులో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మాధవరావు సంతాప సభ సోమవారం నిర్వహిస్తున్నట్లు బార్ అధ్యక్షుడు జగన్‌మోహన్ గౌడ్ తెలిపారు. న్యాయవాదులు హాజరు కావాలని కోరారు.

మళ్లీ ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ

బాల్కొండ: పొలాల వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను దొంగలు మళ్లీ ఎత్తుకెళ్తున్నారు. ఏడాది క్రితం డిచ్‌పల్లి శివారులో జాతీయ రహదారిపై ట్రాన్స్‌ఫార్మర్ కాయిల్స్, ఆయిల్ చోరీ చేసే గ్యాంగ్‌ను పోలీసులు పట్టుకున్నారు. అప్పటి నుంచి ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలు కనిపించలేదు. తాజాగా మళ్లీ వారం క్రితం నుంచి ప్రారంభమయ్యాయి. ట్రాన్స్‌ఫార్మర్లలో ఉండే కాపర్ కాయిల్స్, ఆయిల్‌ను ఎత్తుకెళ్లి ట్రాన్స్‌ఫార్మర్ డబ్బాను కింద పడేసి పోతున్నారు. దీంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. తాజాగా ముప్కాల్ మండల కేంద్ర శివారులో లక్ష్మి కాలువ పక్కన గల వ్యవసాయ క్షేత్రం నుంచి 25 కేవీఏ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎత్తుకెళ్లారు.

కీలక సమయంలో..

ప్రస్తుతం యాసంగి సీజన్‌లో వరి నాట్లు వేయడం జోరందుకుంది. ఈ సమయంలో దొంగలు ట్రాన్స్‌ఫార్మర్ ఎత్తుకెళ్తున్నారు. దీంతో కరెంట్ లేక పొలాలకు నీరు పెట్టడానికి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ చోరీకి గురైనా.. ట్రాన్స్‌కో అధికారులు వెంటనే అందించే అవకాశం లేదు. నిబంధనాల ప్రకారం కేసు నమోదు చేయాలి. ఎఫ్ఐఆర్ కాపీ కావాలి. దీంతో నాట్లు వేయడానికి ఆలస్యం అవుతుందని రైతులు అంటున్నారు. మరోవైపు వేసిన వరి నాట్లు ఎండిపోతాయి. గతంలో బాల్కొండ మండల కేంద్రంలో జాతీయ రహదారి 44కు ఇరువైపులా, కిసాన్‌నగర్‌లో జాతీయ రహదారి పక్కన ఉన్న వ్యవసాయ క్షేత్రాలను టార్గెట్ చేసుకుని ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ ఎక్కువగా జరిగేవి. మళ్లీ చోరీలు మొదలవ్వడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.



ముప్కాల్ శివారులో చోరీకి గురైన ట్రాన్స్‌ఫార్మర్

రైతులు గస్తీ తిరగాలి

పొలాల వద్ద ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురికాకుండా రైతులు కొన్ని రోజుల పాటు గస్తీ తిరగాలి. చోరీ అయిన వాటి స్థానంలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌లు వెంటనే ఇవ్వడానికి ప్రయత్నిస్తున్నాం.

– శ్రీనివాస్, ట్రాన్స్‌కో ఏఈ, ముప్కాల్

తల్లి ప్రసంగం.. తనయుడి ఆనందం



నిజామాబాద్ నగరంలోని సుభాష్‌నగర్‌లో ఆదివారం నిర్వహించిన బహిరంగ సభలో ఎమ్మెల్సీ కవిత మాట్లాడారు. కవిత ప్రసంగాన్ని ఆమె కుమారుడు ఆదిత్య ప్రజల మధ్య నిలబడి ఆసక్తిగా వింటూ చప్పట్లు కొట్టారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

క్రైం కార్నర్

వాహనం బోల్తా



నవీపేట: నవీపేటలోని దర్యాపూర్ రైల్వేగేటు సమీపంలో ఆదివారం ఐచర్ వాహనం బోల్తా పడింది. నిజామాబాద్ నుంచి మహారాష్ట్రకు గాజుఫ్రేమ్‌లతో వెళ్తున్న వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ప్రధాన రైల్వేగేటు మరమ్మతులు కొనసాగుతుండడంతో తాత్కాలికంగా గేటును మూసివేశారు. ముందస్తు సమాచారం లేక కొందరు వాహనదారులు గేటు సమీపంలోకి వచ్చి ఇబ్బందులు పడుతున్నారు. పక్కనే గల ఇరుకు రోడ్డు వెంట వెళ్తూ ప్రమాదాలు కొనితెచ్చుకుంటున్నారు. రెండు రోజుల కిందట పత్తి లారీ బోల్తాపడగా.. తాజాగా ఐచర్ వాహనం బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

కాలువలోకి దూసుకెళ్లిన క్రేన్



బాల్కొండ: క్రేన్ అదుపు తప్పి శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ దిగువన కాకతీయ కాలువలోకి దూసుకెళ్లింది. ప్రాజెక్ట్‌పై వరద గేట్ల పనుల కోసం వినియోగిస్తున్న క్రేన్‌ను మరమ్మతుల కోసం మెకానిక్ షాపు వద్దకు తీసుకెళ్తుండగా అదుపు తప్పి కాలువలో పడింది. కాలువ ద్వారా నీటి విడుదల నిలిపేసి, ఇతర క్రేన్‌ల సాయంతో దానిని బయటకు తీశారు.

డివైడర్‌ను ఢీకొన్న కారు



నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని వెల్గనూర్ శివారులో సంగారెడ్డి – నాందేడ్ జాతీయ రహదారిపై ఆదివారం టైర్ పేలడంతో ఓ కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. బెంగుళూరు చెందిన ఓ కుటుంబం కారులో మహారాష్ట్ర వెళ్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది. కారులోని ఐదుగురు స్వల్పగాయాలతో బయటపడ్డారు. హైవే అంబులెన్స్ సిబ్బంది వారిని పిట్లం ఆస్పత్రికి తరలించారు.

మురికి కాలువలో పడి ఒకరి మృతి

కామారెడ్డి క్రైం: మురికి కాలువలో పడి ఒకరు మృతి చెందిన ఘటన కామారెడ్డి పట్టణంలోని గొల్లవాడలో చోటు చేసుకుంది. వివరాలు.. హరిజనవాడకు చెందిన గాదం నవీన్ (25) కూలీ పని చేస్తుండేవాడు. కొద్ది రోజులుగా ఫిట్స్, ఇతర వ్యాధులతో బాధపడుతన్నాడు. అంతేకాకుండా మద్యానికి బానిసై తిరిగేవాడు. ఆదివారం మధ్యాహ్నం గొల్లవాడ ప్రభుత్వ పాఠశాల వెనుక భాగంలో ఉన్న ఓ మురికి కాలువలో పడి మృతి చెందాడు. పట్టణ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ జరిపారు. మృతుడి అన్న శ్యామరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఎడపల్లి(బోధన్): ఎడపల్లిలోని గురుకుల పాఠశాల వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గురుకుల పాఠశాల ఉపాధ్యాయురాలు స్రవంతి, ఆమె కుమారుడు గాయపడ్డారు. విధులు ముగించుకొని స్రవంతి, ఆమె భర్త శేఖర్, మూడేళ్ల కుమారుడితో బైక్‌పై వెళ్తుండగా కోటగిరి పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ నాగరాజు బైక్‌తో ఢీకొన్నాడు. గాయపడ్డ వారిని స్థానికులు ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై ఎడపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు..



పిట్లం(జుక్కల్): మండలంలోని మద్దెలచెరువు గ్రామ శివారులో ఆదివారం ఉదయం గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి చెందారు. ఎస్సై రాజు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన షేక్ ముస్తాక్ (58) ఊర చెరువు వైపు వెళ్తుండగా పిట్లం – బాన్సువాడ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొంది. క్షతగాత్రుడిని బాన్సువాడ ప్రభుత్వ తీసుకెళ్లగా మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి భార్య షేక్ బెజన్ బీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

ఖలీల్‌వాడి: నూతన సంవత్సర వేడుకల్లో యువత డ్రగ్స్, గంజాయికి దూరంగా ఉండాలని ఎక్సైజ్ ఎస్‌హెచ్‌వో దిలీప్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బహిరంగ ప్రదేశాలు, అనుమతి లేని ప్రాంతాల్లో మద్యం తాగినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఫంక్షన్ హాళ్లు, హోటళ్లలో నిర్వహించే ఈవెంట్లలో మద్యం వినియోగించడానికి ఎక్సైజ్ శాఖ నుంచి పర్మిషన్ తీసుకోవాలన్నారు. కొత్త సంవత్సర వేడుకల సందర్భంగా జిల్లాలో ఏడు ప్రత్యేక ఎక్సైజ్ బృందాలను ఏర్పాటు చేస్తామన్నారు.

చోరీ కేసులో ఇద్దరి అరెస్ట్

ఎల్లారెడ్డి రూరల్: చోరీ కేసులో ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై మహేశ్ ఆదివారం తెలిపారు. వివరాలు.. ఎల్లారెడ్డికి చెందిన మహ్మద్ అబేద్ ఈ నెల 19న ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లగా.. ఇద్దరు వ్యక్తులు ఇంట్లోకి చొరబడి దొంగతనం చేశారు. నగదు, ఏటీఎం కార్డు ఎత్తుకెళ్లారు. ఏటీఎం కార్డుతో డబ్బులను విత్ డ్రా చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసిన పోలీసులు మెదక్ జిల్లా హవేళి ఘనపూర్ మండలం తొగిట గ్రామానికి చెందిన మహేశ్, నాగిరెడ్డిపేట మండలం లొంకపల్లి గ్రామానికి చెందిన దుర్గయ్యను అరెస్ట్ చేశారు.

భౌగోళిక సదస్సులో సౌత్‌క్యాంపస్ అధ్యాపకులు



భిక్కనూరు: హైదరాబాద్‌లో ఉస్మానియా యూనివర్సిటీలో ఆదివారం నిర్వహించిన 46వ భారత భౌగోళిక సదస్సులో తెలంగాణ యూనివర్సిటీ సౌత్‌క్యాంపస్‌కు చెందిన జియో ఇన్ఫర్‌మేటిక్స్ అధ్యాపకులు పాల్గొన్నారు. జియోఇన్ఫర్‌మేషన్ టెక్నాలజీని వివిధ రంగాలలో ఏవిధంగా వినియోగిస్తున్నారనే విషయమై వివిధ విశ్వవిద్యాలయాల అధ్యాపకులు పరిశోధక విద్యార్థులు పలు పరిశోధనా అంశాలను వెల్లడించారు. సౌత్ క్యాంపస్ జియో ఇన్ఫర్‌మేటిక్స్ హెచ్‌వోడీ కవితా తోరస్, అధ్యాపకులు సబిత, నారాయణ గుప్తా, విద్యార్థులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ల అప్పగింత



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పోలీస్ స్టేషన్ పరిధిలో సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న బాధితులకు ఎస్సై మహేశ్ రికవరీ చేసి ఆదివారం అందజేశారు. ఎల్లారెడ్డికి చెందిన సురేందర్, కృష్ణమూర్తి, అశోక్ ఇటీవల సెల్‌ఫోన్లు పోగొట్టుకుని సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేశారు. ఫోన్ల ఆచూకీని కనుక్కొని బాధితులకు అందించినట్లు ఎస్సై తెలిపారు.